**కథ**

# కనబడుటలేదు

**'కనబడుట లేదు' పేపరు తిరగేస్తున్న విశ్వం కళ్లు యథాలాపంగా ప్రకటన మీద పడ్డాయి. కానీ దాంట్లో ఏదో లోపం కనిపించింది. కనుబొమలు ముడిచి దీక్షగా చూశాడు.**

'ఆ! ఫోటో... ఫోటో లేదేంటి? మరి తప్పిపోయిన వాళ్లని గుర్తుపట్టేదెలా...' పేపర్ని చిన్నదిగా దగ్గరికి మడిచి చదివాడు. ''కనబడుట లేదు.. నీలిరంగు అట్టతో ఉన్న రెండు వందల పేజీల సింగిల్ రూళ్ల నోట్‌బుక్ మూడు రోజుల నుండి కనబడుటలేదు. అందులో నల్లటి ఇంకుతో రాసిన కవితలూ (అముద్రితాలు), ముగింపు లేని కథ ఉన్నాయి. కలం పేరు 'కాకి' అని అట్ట వెనుక కనిపిస్తుంది. రచయిత్రి బెంగతో మంచం పట్టింది కనుక పుస్తకం కనబడిన వెంటనే ఈ దిగువ చిరునామాకు పంపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.''

షాక్ కొట్టినట్లు లేచి లోపలికి పరుగెత్తాడు విశ్వం. నిస్త్రాణగా మంచం మీద పడుకున్న భార్య దిండు కింద చెయ్యి పెట్టి బయటికి లాగి చూశాడు. 'నీలి రంగు అట్ట, నల్లటి ఇంకు, కవితలూ, కాకి...' అవును అదే. ''పారూ!'' అతని పొలి కేకకి పారు ఇటు పొర్లింది.

''లే! లే! మనం వెంటనే ఒక చోటికెళ్లాలి. నీ రోగం తగ్గించే చోటికి. పక్క సందులోనే'' అంటూ భార్యని లేవదీశాడు.

★ ★ ★

అక్కడ సదరు రచయిత్రి కామాక్షి కిషోర్, (పొట్టిగా 'కాకి') సోఫాలో కూర్చుని ఆలోచిస్తోంది. సరిగ్గా వారం రోజులైంది, తన పుస్తకం కనబడక. వారం రోజుల నుండి జరిగిందంతా రీలులా కదిలింది.

ఆ రోజు వెతికీ వెతికీ అలసిపోయి సోఫాలో కూలపడింది కామాక్షి. ఎందుకో మనసు కీడు శంకించింది. మొగుడూ, పిల్లలూ వెళ్లాక ఇల్లంతా అటకలతో సహా వెతికింది.

ఇంట్లో ఎవరికీ దాన్ని తీసే అవసరమే లేదు. అయినా ఒకసారి అడిగి చూద్దాం అని రాత్రి పనంతా అయ్యాక ఏదో చదువుకుంటున్న కిషోర్ పక్కన చేరి మెల్లగా అడిగింది. ''ఏవండీ! నా కవితల పుస్తకం కనిపించడం లేదండీ, మీరేమైనా చూశారా?'' తలెత్తి కామాక్షి వంక చూశాడు. అలసటలో అందంగా ఉన్న కామాక్షి ముఖాన్ని చూస్తూ ''ఇంత మంచి చల్లటి వెన్నెల రాత్రి కవితలూ, పుస్తకాలూ అంటావేంటోయ్'' గోముగా అంటూ లైటార్పేశాడు కిషోర్.

అప్పుడే డిసైడైపోయింది కామాక్షి. ఈ మనిషి దాన్ని వెతికే ప్రయత్నం ఏమీ చెయ్యడనీ, వేరెవర్నయినా ఆశ్రయించాలనీ.

పెళ్లయిన కొత్తలో కాలేజీ రోజుల్లో రాసిన కవితలూ, కథలూ చూపిస్తే అంతా చదివాక 'కాలేజీ మాగజైన్‌లో కనుక వేసుకున్నారు' అంటూ చప్పరించి పక్కన పడేశాడు. ఈమధ్యే రెండో పిల్ల కూడా స్కూలుకెళ్లడం మొదలెట్టాక కాస్తంత ఖాళీ దొరికి మళ్లీ కవితావేశం పొంగుకొస్తోంది. అన్నీ ఒక నోట్ పుస్తకంలో భద్రపరుస్తోంది. భర్తకి కవిత్వం అంటే ఇష్టం లేదో లేక తన కవిత్వం అంటే అయిష్టమో తెలియదు కానీ ఆ పుస్తకానికి అంత ప్రాముఖ్యత ఇచ్చి వెతికిపెడతాడని ఆశ మాత్రం లేదు.

మర్నాడు విమలకి ఫోన్ చేసింది. కామాక్షి కంగారుకి విమల ఆదరాబాదరా ఆఫీసుకి హాఫ్‌డే లీవ్ పడేసి కామాక్షి దగ్గర వాలింది. ''ఏంటి అలా ఉన్నావ్? ఏం జరిగిందీ''?

''విమ్మీ! నా కవితల బుక్ మొన్నట్నించీ కనిపించడం లేదే'' దాదాపు ఏడుపుగొంతుతో అంది కామాక్షి.

''ఓస్! అంతేనా! ఇంకేంటో అని హడలి చచ్చాను కదే'' గట్టిగా ఊపిరి తీసుకుంది విమ్మీ.

''నువ్వు కూడా మా ఆయనలా అలా తీసిపడెయ్యకే'' నీరసంగా అంది.

''అవన్నీ నీ సొంత భావాలేగా మళ్లీ రాసుకో. దానికింత కంగారూ, బాధా ఎందుకని'' విమల చాలా తేలిగ్గా అంది.

''కవిత్వం అంటే ఎంత చులకనే మీకు. ఒకసారి వచ్చిన భావోద్వేగం మళ్లీ వస్తుందా? పోటీకోసం రాస్తున్న కథ కూడా ఉందందులో''

''సర్లే! అసలెలా పోయిందో ఒకసారి గుర్తు తెచ్చుకో'' ధైర్యం వచ్చింది కామాక్షికి. అయిదు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించాక గుర్తొచ్చింది. శనివారం రాత్రి కథ రాస్తూ రాస్తూ సోఫాలోనే నిద్రపోయింది. తిరిగి షెల్ఫ్‌లో పెట్టుకున్న గుర్తు లేదు. అంటే టీపాయ్ మీదే వదిలేసిందన్నమాట.

విషయం విన్న విమల ''ఆదివారం పొద్దున ఎవరెవరు వచ్చారు మీ ఇంటికి?'' అంది.

''ఆ! పక్క ఫ్లాట్‌లోని గుడ్లగూబ, పెంట్‌హౌస్‌లో ఉండే వసపిట్ట వచ్చారు'' ఆలోచిస్తూ అంది కామాక్షి.

''ఏంటి? మీ అపార్ట్‌మెంట్స్‌లో పక్షులు కూడా కాపురం ఉంటున్నాయా?'' విమల సీరియస్‌గా అడిగింది.

''చాల్లే జోకులాపు! వాళ్లిద్దరే అప్పుడప్పుడు మా ఇంటికొచ్చేదీ, కాస్త పుస్తకాలూ, టీవీ సీరియల్స్ గురించి చర్చించేదీనూ. గడ్డం పెంచి కవినైపోయాననుకుంటాడు గుడ్లగూబ. టైమ్ లేక కానీ, లేకపోతే ఇలాంటి సీరియల్స్ వంద రాయగలనని వాపోతుంది వసపిట్ట. వాళ్లిద్దరి మీదే నా అనుమానం'' అనవసరంగా వాళ్ల మీద పగ పెంచేసుకుంది కామాక్షి.

''మరి వాళ్లనడిగితే పోలా?''

''నీ బొంద! కావాలని తీసిన వాళ్లు డైరెక్ట్‌గా అడిగితే ఇస్తార్టే? అవన్నీ ఏ పత్రికకో పంపించేసుంటారేమోనే!'' పుస్తకం గడప దాటిందనే ఊహ రాగానే నీరసం వచ్చేసింది కామాక్షికి.

''అప్పుడే అంత దూరం ఆలోచించకే, రెండ్రోజులేగా అయింది. మనం ఫాలో అయితే వాళ్లకి తెలిసిపోతుంది. ఆ! నా కొలీగ్ వాళ్ల తమ్ముడు ఎవరో ప్రైవేట్ డిటెక్టివ్ దగ్గర అసిస్టెంట్‌గా పన్జేస్తున్నాడు. మనకేమైనా ఉపయోగపడతాడేమో ఇప్పుడే కనుక్కుంటానుండు'' అంటూ తన బాగ్‌లోని బుల్లి డైరెక్టరీ తిరగేసి రెండు మూడు ఫోన్లు చేసి మాట్లాడింది విమల.

ఒక గంటలో ఆ అసిస్టెంట్ అర్జున్ రానే వచ్చాడు. వివరాలు తీసుకున్నాడు. వెంటనే రంగంలోకి దూకేశాడు. తన పంథాలో ముందు కామాక్షి ఇంటిని పరిశోధించాడు. వారం రోజులు టైమడిగాడు.

★ ★ ★

ముందుగా గుడ్లగూబని ఫాలో అవడం మొదలెట్టాడు. అతనొక బాంక్ ఆఫీసర్. కళాభిరుచీ, ఆసక్తీ ఉన్నా కూడా పోషణ చెయ్యడానికి టైమ్ లేని అశక్తుడు. అందరికీ ప్రతివారం వచ్చే ఆదివారం అతనికి మాత్రం రెండు మూడు వారాలకొకసారి వస్తుంది. బాంకే పరమావధి, బాంకే సర్వస్వం అనుకునే మామూలు బతకలేక బాంకాఫీసరు. బాంక్ పనిలో పడి పెళ్లి చేసుకోవడం కూడా మర్చిపోయిన ముదురు బెండకాయ. బాంక్ లోనుతో ఫ్లాట్ కొనుక్కుని తల్లితో ఉంటున్నాడు. 'ఆఫీసు పదింటికైతే ఎనిమిదింటికే బయల్దేరాడేమిటి? ఇదేదో అనుమానపు కేసే' అని గుడ్లగూబ స్కూటర్ని ఫాలో అయ్యాడు అసిస్టెంట్. బాంక్ షట్టర్లు ఎత్తి తన సీట్లో కూర్చున్న మనిషి రాత్రి

**వెలమకన్ని మధుమతి**



...ఎని మిదింటిదాకా, మధ్యలో ప్రకృతి పిలుపులకి ఒకటి రెండుసార్లు తప్ప లేవని ఆ మానవుణ్ని చూస్తే అర్జున్‌కి తెగ ఆశ్చర్యం వేసింది. గమ్‌గానీ సీట్‌కి పూశాడా అని అతను సీట్లో లేనప్పుడు వెళ్లి చూసొచ్చాడు.

మర్నాడు అతను బాంక్‌కెళ్లగానే ఇంట్లో దూరి అతని తల్లిని కుశలప్రశ్నలు వేశాడు అసిస్టెంట్. ''ఆ! ఏం బాగులే నాయనా! బీపీ బాగా ఎక్కువైంది. షుగర్ కూడా ఎక్కువైందో ఏమో ఒహటే కళ్లు తిరగటం. కాళ్లూ చేతులూ లాగేస్తున్నాయి. గుండె దడ. ఏం తిన్నా అరగదు నాయనా. వికారంగా ఉంటుంది. ముప్పొద్దులా తిన్నా నీరసం మాత్రం తగ్గట్లేదు. ఎందుకంటావ్? ఇదుగో ఈ మాత్ర బీపీకి, ఈ పచ్చది వికారానికి. ఇది కడుపునొప్పికీ, ఇదీ...కీ, అదీ...కీ..'' అంటూ పెద్ద పోపులడబ్బా తెచ్చి చూపెట్టింది ఆ ఇల్లాలు. రంగురంగుల టాబ్లెట్లతో చూట్టానికి చాలా బాగుంది. అంతే ఆ దెబ్బకి వచ్చిన పని మర్చిపోయి, పొరపాట్న కూడా ఎవర్నీ బాగున్నారా అని అడగ్గూడదని నిర్ణయించుకుని ''అన్ని మందులు మింగే బదులు, ఒక బుల్లి డాక్టర్ని మింగేయండి ఆంటీ. లోపల అన్నీ వాడే చూసుకుంటాడు'' అనేసి ఒక రోగిష్టి వాడిలా బయటపడ్డాడు.

★ ★ ★

మర్నాడు రెండో కేసు వసపిట్ట వెంట పడ్డాడు. కుర్రపిల్ల, హుషారుగా ఉంటుంది. పెళ్లయ్యే దాకా అన్నయ్య ఫామిలీతో ఉంటూ ప్రైవేటు కంపెనీలో కాలక్షేపానికి ఉద్యోగం.

ఆమెతో పాటు బస్సు దిగి చూడగానే ఎదురుగా పత్రికాఫీసు. ఎగిరి గంతేశాడు 'మాడమ్‌గారి బుక్ దొరికినట్లే' అని. పత్రికాఫీసు దాకా వెళ్లిన వసపిట్ట అక్కడి బస్టాప్‌లో రెండో బస్సెక్కింది. కంగారుగా రన్నింగ్ బస్సెక్కి అలవాటు లేక పడబోయి తమాయించుకున్నాడు డిటెక్టివ్ అసిస్టెంట్. 'గంటన్నర ప్రయాణం చేసి ఇంత దూరం వచ్చి నా ప్రాణం తియ్యకపోతే దగ్గర్లో ఏ ఉద్యోగమూ దొరకలేదా తల్లీ!' తిట్టుకుంటూ ఆఫీసు బయట తిష్ట వేశాడు. ఆమె ఒక్క క్షణం సీట్లో కుదురుగా కూర్చుంటే ఒట్టు. మిడతలా లేస్తూనే ఉంది.

## నయనానందం

**చంద్రముఖి, గజిని, లక్ష్మీ చిత్రాల నయన తార ఇప్పుడు ఆనందంగా ఉంది. వరుసపెట్టి తెలుగు చిత్రాల్లో నటించే అవకాశం లభించడం, అవి బాక్సాఫీస్ హిట్ కావడం ఆమె ఆనందానికి కారణంగా చెప్పుకోవచ్చు. ఇప్పుడీ భామ వి.వి.వినాయక్ దర్శకత్వంలో రూపొంద నున్న కొత్త చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని సీఎం బంధువు పి.రవీంద్రనాథ్‌రెడ్డి నిర్మిస్తుండడం విశేషం. ఈమె సరసన ప్రభాస్ హీరోగా**

ఇంతలో ''ఎవడ్రా నువ్వు? ఇందాకట్నుండీ తొంగి తొంగి చూస్తున్నావు'' వాచ్‌మెన్ చెంప ఛెళ్లుమనిపించాడు. వాచిన చెంప దాచుకుంటూ కామాక్షి దగ్గరకొచ్చేసి చేతులెత్తేశాడు అసిస్టెంట్.

ఒక డిటెక్టివ్‌కే చేతకాని పని తానేం చెయ్యగలదు? దుఃఖం ముంచుకొచ్చింది. భార్య అంతలా బాధపడుతుంటే కంగారు పడి, అప్పుడు విషయం వివరంగా తెలుసుకున్నాడు కిషోర్. తనూ కాస్సేపు ఆలోచించి చావు కబురు చల్లగా చెప్పాడు. మొన్న పాత పేపర్లు అమ్మినప్పుడు ఏదో నోట్ బుక్ కూడా వెళ్లిందనీ, పిల్లలు వాళ్లది కాదన్నారనీనూ.

పైగా ''పత్రికలకెందుకు పంపలేదూ...'' అని ప్రశ్న కూడా.

''హు! ఈ కథకి విలన్ మీరేనన్నమాట. అయిపోయింది. ఇంకెలా దొరుకుతుందది? ఏ పల్లీలకో, పకోడీలకో వెళ్లిపోయింది. కవితా సంపుటి వేయిద్దామని ఆలోచన. పబ్లిషర్‌తో మాట్లాడాను కూడా. ఈ లోపల కథల పోటీ ఉంటే కథ సగం రాస్తూ...'' గొంతు పూడుకుపోయింది కామాక్షికి.

భార్యను ఓదార్చి, పాత పేపర్ల షాప్‌కి తీసుకెళ్లాడు. ''మొన్న ఆదివారం అమ్మిన పాత పేపర్లతో పాటు ఒక ముఖ్యమైన పుస్తకం కూడా పొరపాట్న వచ్చింది బాబూ, కొంచెం చూడు... ఉందేమో''.


ఆ మాటకి అదిరిపడి లేచి నిల్చొని రెండడుగులు వెనక్కి వేశాడు షాపు యాదగిరి.

''సరిగ్గా రెండ్రోజుల కిందట మీ లెక్కనే ఇద్దరొచ్చి ఏదో నోటుపుస్తకం చూపించి, దీంట్లో చివరి పేజీలు నీ షాపులో ఉండిపోయాయి. ఇస్తావా. ఛస్తావా అని నన్ను కొట్టినంత పని చేసి నా షాపును కిందా మీదకి చేశ్నిను. ఇప్పుడిక మీరు ఏకంగా బుక్కే కావాలంటుండ్రు నాకేం తెలీదు బాబో! నన్నొదిలేయండి'' భయపడిపోయాడు యాదగిరి.

అంటే తన పుస్తకం ఎవరి చేతికో వెళ్లిందన్న మాట. కామాక్షీ మనసులో మాట పైకనేసింది. ''చివరి పేజీలు అడిగారంటే... తప్పకుండా దాని ప్రాముఖ్యత తెలిసిన వాళ్లే. కామూ! నీ బుక్ దొరికినట్లే, పేపరు ప్రకటన ఇద్దాం, పద''

★ ★ ★

కాలింగ్‌బెల్ మోగటంతో వర్తమానంలోకొచ్చేసింది కామాక్షి.



పార్వతీ, విశ్వం లోపలికొచ్చి కూర్చున్నారు. ''నా పేరు విశ్వం. కాకీగారు...'' నసుగుతుంటే

''ఈవిడే'' అని కామాక్షి వంక వేలు చూపించాడు కిషోర్.

''నమస్తే మాడమ్! మీరిచ్చిన ప్రకటనలోని పుస్తకం బహుశా ఇదేనేమో చూడండి''

పుస్తకం అందుకుంటూ కామాక్షి ఆనందం పట్టలేకపోయింది. గబగబా పేజీలన్నీ తిరగేసింది అన్నీ ఉన్నాయో లేదోనని.

''చాలా థాంక్సండీ! మీ ఋణం తీర్చుకోలేను'' అని ఇటు కిషోర్‌తో ''ఏమండీ! మనం అనుకున్న పారితోషికం తెచ్చివ్వండీ!'' అంది.

''అబ్బెబ్బే! మాకేం వద్దు, మీరు రాసిన ఆ కథకి ముగింపు మాత్రం కాస్త చెప్పండి. అదే మాకు పెద్ద పారితోషికం. ఎండింగ్ ఏమై ఉంటుందా అని మా ఆవిడ అప్పట్నుండీ మంచం పట్టింది'' విశ్వం బతిమలాడాడు.

''ఇంతకీ ఇది మీకెలా దొరికింది?''

''ఆదివారం పాత పేపర్లు అమ్మాలని ఇద్దరం షాపుకెళ్లాం. అక్కడ ఫాను గాలికి ఈ పుస్తకంలోని పేజీలు ఎగురుతుంటే అందులోని అక్షరాలు మా ఆవిడ కంట పడ్డాయి. వెంటనే దాన్ని దాచేసి ఇంటికి తెచ్చింది. తను కూడా ఒకప్పుడు రచనలు చేసేది. తన స్వవిమర్శతో పాటు, నా తీవ్ర విమర్శలకి ఏ రచనా పత్రికల ముఖం చూడలేదు. దాంతో ఆమెలోని రచయిత్రి చచ్చిపోయింది. కానీ మంచి పాఠకురాలైంది. కనిపించినదేదీ చదవకుండా వదలదు. ఏ రచయితా ఇలాంటి అపురూపమైన పుస్తకాన్ని చిత్తుకాగితాల కింద అమ్ముకోడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లోపించడమో లేక నా లాంటి గుణమున్న భర్తో, భార్యో దీని వెనుక ఉండి ఉంటారని నేను ఊహించాను. ప్రకటన చూశాక....'' విశ్వం మాటలను అడ్డుకుంటూ ''హలో బ్రదర్ అది నేను కావాలని చేయలేదు. కొంత పట్టించుకోని మాట నిజమే కానీ..'' కిషోర్ భుజాలు తడుముకున్నాడు.

''ఇంతకీ ముగింపు చెప్పారు కాదు, హీరోయిన్ చివరికి ఆత్మహత్య చేసుకుందా?'' సన్నగా గొణిగింది పార్వతి.

''ఛీ! నా హీరోయిన్‌కి అంత ఖర్మేం పట్టింది?'' మూతిముడిచింది కామాక్షి.

''పుస్తకం దొరికాక... ఇంకేముంటుంది?.. కథ సుఖాంతమే'' కామాక్షిని క్రీగంట చూస్తూ అన్నాడు కిషోర్.

పార్వతి హాయిగా ఊపిరి పీల్చుకుంది.